ప్రజాశక్తి


మంగళవారం 20 డిసెంబర్ 2022 8 పేజీలు







గుంటూరు పల్నాడు

విస్తరిస్తున్న కండ్లకలక







ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కండ్ల కలక వైరస్ వేగంగా విస్తరిస్తోంది. వివిధ కంటి ఆస్పత్రులకు గత వారం రోజులుగా వైరస్ సోకిన రోగుల తాకిడి పెరిగింది. ఒక్కొ ఆస్పత్రికి రోజుకు 20-30 మంది కండ్లకలక సోకిన వారు వస్తున్నారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో ప్రతిఏటా శీతలకాలంలో వచ్చే ఈ వైరస్ కొన్ని రోజులుగా చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా పలువురిని ఇబ్బంది పెడుతోంది. ఈ వైరస్ సోకితే మూడు నుంచి ఐదు రోజుల పాటు కళ్లకు సమస్య ఏర్పడుతుంది. ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు ఈ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంటోంది. ఒకరి నుంచి మరొకరికి కొద్ది గంటల వ్యవధిలోనే కళ్లకు వైరస్ సోకుతోంది. ఈ వైరస్ వల్ల పెద్దగా ప్రమాదం ఏమీ

▶ 2లో

నల్ల గుడ్డుకు వైరస్ వస్తే ప్రమాదం : డాక్టర్ రామకృష్ణ

కండ్ల కలక ఈ సీజన్‌లో వచ్చే సహజమైన వైరస్ అని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి కంటి వైద్యవిభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. మాట్లాడుతూ కండ్లకలక సమస్య కంటి లోపల నల్లగుడ్డుకు కూడా వస్తే వెంటనే కంటి వైద్యులను సంప్రదించాలన్నారు. తగిన చికిత్స తీసుకోకపోతే దీని వల్ల చూపు కూడా తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు ప్రత్యేకంగా మందులు వాడాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కండ్లకలక వైరస్‌కు మాత్రం యాంటిబయాటిక్స్ డ్రాప్స్‌ను కొనుగోలు చేసి వినియోగించుకోవచ్చునని, నల్లగుడ్డుకు వైరస్ రాకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రాథమిక దశలోనే డ్రాప్స్‌ను వినియోగించాలన్నారు. కండ్లకలక వచ్చిన వారు విడిగా ఉండాలని, అందరితో కలిసి ఉంటే మిగతా వారికీ వ్యాపిస్తుందని చెప్పారు. వీరు వినియోగించిన దుస్తులు, వస్తువులు, ఇతరులు వినియోగించుకూడదన్నారు. యాంటిబయాటిక్స్ డ్రాప్స్ వినియోగించుకుంటే మూడు రోజుల్లో తీవ్రత తగ్గుతుందని, ఐదు రోజుల్లో పూర్తిగా తగ్గుతుందని, భయమేమీ వద్దని వివరించారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

హక్కుల హననంలో కేంద్రం బాటలోనే రాష్ట్రం

సిఐటియు గుంటూరు, పల్నాడు జిల్లా మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శులు నరసింహారావు, ముజఫర్ అహ్మద్

8 లో

గుంటూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా డి.లక్ష్మీనారాయణ, వై.నేతాజి

పల్నాడు జిల్లాకు కె.హనుమంతరెడ్డి, ఎస్.ఆంజనేయులు నాయక్



వై.నేతాజి, దండాలక్ష్మీనారాయణ



ఎస్.ఆంజనేయులు నాయక్, కె.హనుమంతరెడ్డి

రైల్వే ఉద్యోగాలిప్పిస్తామని మోసం

రూ.45 లక్షలు కుచ్చుటోపీ పెట్టిన ఇద్దరిపై బాధితుల ఫిర్యాదు 2 లో

మిర్చి గిడ్డంగిలో చోరీ కేసులో ఒకరు అరెస్టు

నిందితుని వద్ద రూ.19.21 లక్షలు స్వాధీనం 2 లో

బదిలీలు జరుగుతుంటే మళ్లీ సర్దుబాటా?

లోపభూయిష్ట ఉత్తర్వులతో పాఠశాలలకు అన్యాయం : యుటిఎఫ్

ప్రజాశక్తి - నరసరావుపేట

ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించడానికి ఉత్తర్వులు జారీ చేసే ముందు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇచ్చిన ఉత్తర్వులు లోపభూయిష్టంగా ఉన్నాయని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారథి విమర్శించారు. ఉపాధ్యాయులకు నష్టం కలిగించే అంశాలను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు జీవో 187 ప్రకారం ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ జరుగుతున్న సందర్భంలోనే పని సర్దుబాటు పేరుతో గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులకు సర్దుబాటు పేరిట ఉత్తర్వులు జారీ చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. సర్దుబాటు పేరుతో కొందరు ప్రజా ప్రతినిధుల సిఫార్సుల మేరకు గతంలో ఇచ్చిన ఉత్తర్వులు పల్నాడు జిల్లాలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో రద్దు చేయించామని, ఇప్పుడు మళ్లీ ఇచ్చిన ఉత్తర్వుల్లోనూ ఉపాధ్యాయుల అవసరం ఉన్న పాఠశాలకు సర్దుబాటు మరిచారని తెలిపారు. కొందరు ప్రజాప్రతినిధులు ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం ఇప్పుడు సర్దుబాటు చేస్తామంటే విద్యార్థులున్న పాఠశాలలకు ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. బదిలీల సందర్భంగా సమాంతరం జరిగే ఈ పని సర్దుబాటు ఉత్తర్వులు నిలిపేయాలని, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు న్యాయం జరగకుంటే యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.



ఆరుగురు రైతుల నుండి కొనుగోలు

ధాన్యం సేకరణపై వాల్‌పోస్టర్ విడుదలలో అధికారులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు ఆరుగురు రైతుల నుండి 49.600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కోసం విస్తృత ప్రచారం చేస్తామని అన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎ.శివశంకర్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. జెసి మాట్లాడుతూ క్వింటాళ్‌కు కనీస మద్దతు ధర 'ఎ' గ్రేడ్ ధాన్యానికి రూ.2060, సాధారణ రకానికి రూ.2040కు కొనుగోలు చేస్తామని తెలిపారు. ధాన్యం సేకరణకు కావాల్సిన గోనె సంచులు వినియోగానికి అయ్యే ఖర్చును సంచి (40 కిలోలు)కి రూ.3.39, హమాలీల ఛార్జీ క్వింటాళ్‌కు రూ.25 చొప్పున నిర్ణయించినట్లు తెలిపారు. రవాణా ఛార్జీలు స్థానికంగా నిర్ణయించిన దానిబట్టి ఉంటాయన్నారు. రైతులంతా మద్దతు ధరకు తమ పంటను అమ్ముకోవాలని సూచించారు.

అత్యాచారం కేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

ఇంటి బయట నిద్రిస్తున్న విద్యార్థినిని కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసిన ముద్దాయి చండిక శ్రీనివాసవర్మకు జీవిత ఖైదు, రూ.15 వేలు జరిమాన విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బాపట్ల ప్రాంతానికి చెందిన బాధితురాలి కుటుంబం, నిందితుల కుటుంబం ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో నివాస ఉండే వారు. బాధితురాలు కాలేజీకి వచ్చే సమయంలో నిందితుడు ఆమెను ప్రేమ, పెళ్లి పేరుతో వేధించడంతోపాటు బెదిరించేవాడు. దీనిపై బాధితురాలు తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అతన్ని ప్రశ్నించగా గొడవ పెట్టుకున్నాడు. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు ఆమెను నూజివీడులో బంధువుల ఇంటికి పంపి, పెళ్లి చేయాలనుకుంటున్న సమయంలో ఆమెపై శ్రీనివాసవర్మ తప్పుడు ప్రచారం చేయటంతో పెళ్లి ఆగిపోయింది. బాధితురాలు పోటీ పరీక్షలకు కోచింత్ కోసం గుంటూరులో హాస్టల్‌లో చేరింది. 2014 ఆగస్టు 11న హాస్టల్ నుండి తన సొంతూరుకు వెళ్లిన బాధితురాలు రాత్రి వేళ ఇంటి బయట నిద్రిస్తుండగా నిందితుడు ఆమెను బలవంతంగా కిడ్నాప్ చేసి, మోటారు సైకిల్‌పై ఎక్కించుకొని గుంటూరు తీసుకెళ్లి, తన స్నేహితుడి ఇంట్లో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇంటికొచ్చి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పటంతో వారు బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. నిందితులపై కేసు రుజువు కావటంతో న్యాయమూర్తి పైమేర తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి కె.శ్యామల వాదించారు.

మిర్చి గిడ్డింగిలో చోరీ కేసులో ఒకరు అరెస్టు

నిందితుడి వద్ద రూ.19.21 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు లాలుపురం రోడ్డులోని ఎస్‌కెటి ఎక్స్ పోర్టర్స్ మిర్చి గిడ్డంగిలో జరిగిన చోరీ కేసును నగరంపాలెం పోలీసులు ఎట్టకేలకు చేధించారు. గత కొన్ని సంవత్సరాలుగా గోడౌన్ లో కూలీగా పనిచేస్తున్న గోనెల శంకర్ నమ్మకంగా ఉంటూ తన సమీప బంధువు పోతర్లంక నాగేశ్వరరావుతో కలిసి ఈ నెల 17న తెల్లవారుజామున ఈ చోరీకి పాల్పడ్డాడని జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ సోమవారం మీడియాకు తెలిపారు. ఐటి కోర్ సిబ్బంది సాయంతో నిందితులను గుర్తించారు. గిడ్డంగిలో ఉన్న కుక్కలకు చికెన్ ముక్కలు వేసి....వాచ్మెన్ పై దాడి చేసి నగదు దోచుకొని వెళ్ళారని ఆయన తెలిపారు. పని పూర్తి చేసుకొని ఆనవాళ్లు గుర్తు పట్టకుండా కారం చల్లి అక్కడి నుండి ఉడాయించారు. మరుసటి రోజు గోడౌన్ నిర్వాహకులు ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఈ ఘటన ఇంటి దొంగ పని అని తేలిందన్నారు. అదనపు ఎస్‌పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిఎస్‌పిలు ప్రకాష్ బాబు, పశ్చిమ డివిజన్ డిఎస్‌పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నగరంపాలెం సిఐ హైమారావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. గోనెల శంకర్‌ను అరెస్టు చేయగా మరో నిందితుడు నాగేశ్వరరావు పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి రూ.19.21 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడు వద్ద నుంచి చోరీకి వాడిన కట్టర్ ,బైక్ స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్

రైల్వే ఉద్యోగాలిప్పిస్తానని మోసం

రూ.45 లక్షలకు కుచ్చిటోపి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైల్వేల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి రూ.45 లక్షల వరకు వసూలు చేసి పరారైన ఇద్దరు వ్యక్తులపై బాధితులు సోమవారం జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. గుంటూరుకు చెందిన ఆంజనేయులు తన కుమారుడికి రైల్వేలో ఉద్యోగం కోసం సన్నీ, సామంత్ అనే ఇద్దరికి రూ.15లక్షలు ఇచ్చారు. వీరిలాగే మరో ఇద్దరు కూడా డబ్బులు ముట్టజెప్పారు. ఆ తర్వాత ఉద్యోగం కోసమని ఢిల్లీ, వారణాసి తిప్పారని... ఇప్పుడు డబ్బులు కూడా ఇవ్వకుండా మోసం చేశారని బాధితులు వాపోయారు. డబ్బులు తీసుకున్న వారు ఇంటికి తాళం వేసి, ఫోన్లు స్విచాఫ్ చేసి పారిపోవటంతో పోలీసులకు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ముగ్గురి నుంచి రూ.45 లక్షలు తీసుకుని పరారైనట్లు బాధితులు తెలిపారు. తమ సొమ్ము తమకు ఇప్పించాలని పోలీసుల వద్ద బాధితులు ఆంజనేయులు, రవీంద్ర కన్నీరు పెట్టుకున్నారు. ఆంజనేయులు మీడియాతో మాట్లాడుతూ తెలిసిన వ్యక్తులే కదా అని నమ్మితే మోసం చేశారని అన్నారు.నకిలీ రైల్వే ఐడి కార్డులు ఇచ్చి త్వరలోనే రైల్వే ఉద్యోగానికి రావాలని సన్నీ అనే వ్యక్తి నమ్మబలికారని అన్నారు.

గుంటూరు ఈస్ట్ ఎంఇఒ కార్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఈస్ట్ ఎంఇఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని వైఎస్‌ఆర్‌టిఎఫ్ నగర అధ్యక్షులు చందోలు రవికుమార్ అన్నారు. సోమవారం వైఎస్‌ఆర్‌టి ఎఫ్ నగర కార్యవర్గం సోమవారం అరండల్‌పేటలో నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు పరిధిలో వెంటనే ఎంఇఒ కార్యాలయం ఏర్పాటు చేసి, ఉర్దూ పాఠశాలలకు, తెలుగు పాఠశాలలకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని, పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

విస్తరిస్తున్న కండ్లకలక

(మొదటి పేజీ తరువాయి)

చేయలేకపోయినా జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్య నిపుణులు చెబుతున్నారు. మూడు నుంచి ఐదు రోజుల పాటు యాంటి బయాటిక్స్ కంటి డ్రాప్స్ మాత్రం తప్పని సరిగా వినియోగించాల్సి ఉంది.

తొలుత కళ్లల్లో దురద, కళ్లవెంబడి నీరు కారడం, క్రమంగా ఒక కన్ను ఎరుపు ఎక్కడం, కంటి వాపు రావడం, కొంత మందికి నొప్పి రావడం, తరువాత రెండో కంటికి కూడా వైరస్ వ్యాప్తి చెందటం సహజంగా జరిగే ప్రక్రియగా వైద్యులు చెబుతున్నారు. కండ్ల కలక వచ్చిన వారి కళ్లను ఎక్కువ సేపు చూసినా, పక్కనే కూర్చోన్న త్వరగా వైరస్ వ్యాప్తి జరిగే అవకాశం ఉంది. ఇంటిలో ఒక్కరికి వస్తే మరొకరికి వైరస్ వ్యాపిస్తోంది. అందువల్ల కండ్లకలక వచ్చిన వారు ఇతరులకు దూరంగా ఉండాల్సి ఉంది. కండ్లకలక వచ్చిన వారు ఎక్కువ మంది మందుల దుకాణాలకు వెళ్లి యాంటిబయోటిక్స్ డ్రాప్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. తద్వారా ఇన్‌ఫెక్షన్ తగ్గించుకునేందుకు కొంత మంది సొంత చికిత్సలు చేసుకుంటుండగా మరికొంత మంది ఆస్పత్రులకు వెళ్లి డాక్టర్ల సలహాలతో మందులు వినియోగిస్తున్నారు. పాఠశాలలో ఈ వ్యాప్తి ఎక్కువగా ఉండటం వల్ల కొంత మంది పిల్లలను పాఠశాలలకు పంపడానికి వెనుకంజ వేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో కండ్లకలక వచ్చిన వారిని విడిగి కూర్చొబెడుతున్నారు.

ఉర్దూ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని ఉర్దూ మాధ్యమ పాఠశాలల రేషనలైజేషన్, ఎస్జీటి ఉర్దూ పోస్టుల సర్దుబాటు వంటి పలు సమస్యలు పరిష్కారానికి మైనార్టీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఇషాక్, షబ్బీర్ అహ్మద్ డిఇఒ శైలజను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు మాధ్యమ పాఠశాలల్లో సమాంతరంగా నిర్వహించబడుతున్న ఉర్దూ మాధ్యమ సెక్షన్లకు విద్యార్థుల నమోదు ప్రాతిపదికన ఉర్దూ ఎస్‌జిటి సర్‌ప్లస్ పోస్టును కేటాయించాలని కోరారు. గతంలో 2020లో జరిగిన బదిలీల కారణంగా కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేని పాఠశాలలుగా నిలిచిపోయాయని, అలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను కేటాయించాలన్నారు. అలాగే ఉర్దూ మాధ్యమ ప్రాధిమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉర్దూ పిఇటి పోస్టులు మంజూరు చేయాలని కోరారు.కార్యక్రమంలో ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలు గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూం శాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ గ్రాండ్ క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. క్రిస్మస్ ప్రపంచమంతటా క్రీస్తుని ఆరాధించే పండుగని ఈ నెలంతా అంతా వేడుకలు నిర్వహిస్తారని అన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎంపీ నందిగం సురేష్ , గుంటూరు జిల్లా వైసిపి అధ్యక్షులు ,ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, లిప్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ ,చేబ్రోలు మండల అధ్యక్షులు కొక్కిలిగడ్డ సాహితీ కిరణ్ పొన్నూరు మండల అధ్యక్షులు పద్మలీల ఎంపీడీవో బి బాబురావు చేబ్రోలు మండల గ్రామస్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం రూరల్ యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ వారి ఆధ్వర్యంలో గ్రాండ్ సెమీ క్రిస్మస్, నిడుబ్రోలు రవి కాలనీలో జరిగింది. దీనికి ప్రత్యేక వర్తమానికులు రెవ.కలకోటి దేశ్ బాబు మంగళగిరి నుంచి అలాగే రెవ.డేవిడ్ విల్సన్, నిడుబ్రోలు నుంచి ముఖ్య ప్రసంగీకులుగా వచ్చి ప్రసంగించారు. ముఖ్య అతిథులుగా ఏపీ రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.శంకరరావు, ఏపీ రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ యాదవ్, ఏపీ సంస్థ అధ్యక్షులు అనిల్ కుమార్ , ఎంఈఓ శోభా చంద్ వచ్చి కేక్ కట్ చేశారు. అలాగే పాస్టర్ జాన్ వీక్లీప్ , డాక్టర్ జాన్ సామ్యూల్ గ్రీటింగ్స్ తెలిపారు. సభాధ్యక్షులు పాస్టర్ సర్వేశ్వరరావు, నియోజకవర్గ ప్రెసిడెంట్ పాస్టర్ రవీంద్ర గాబ్రియల్ ఆధ్వర్యంలో గ్రాండ్ సెమీ క్రిస్మస్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మణిపాల్ సెక్రటరీ సర్వేశ్వరరావు, ట్రెజరర్ జాన్సన్ ఎలీషా, డేవిడ్ రాజు ,మోషే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వివిఐటీలో సెమిక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-తెనాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సోమవారం సెమిక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దైవసేవకులు వంగూరి సురేష్, అమెరికాకు చెందిన ఐయూసిఇ సభ్యుడు దండు రామరాజు పాల్గొని క్రిస్మస్ సందేశాన్నిచిచ్చారు. విద్యార్థులు శాంతాక్లాజ్ వేషంలో అలరించారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో వివా డైరెక్టర్ ఎల్‌టి కమాండర్ కేఎస్ రావు, వివా ప్రిన్సిపాల్ సిహెచ్ సరళ, వివిఐటి డైరెక్టర్ డాక్టర్ వైవిఎస్‌ఎస్‌ఎస్‌వి ప్రసాదరావు, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎన్.కుమారస్వామి,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చేబ్రోలు గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో హెూం మంత్రి తానేటి వనిత



తెనాలి వివిఐటిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో కళాశాల యాజమన్యం



పొన్నూరులో కేక్ కట్ చేస్తున్న కె. శంకరరావు తదితరులు



లక్ష్మీపురంలో సందడి చేసిన సినీనటి అనుపమ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు లక్ష్మీపురంలో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన కాంచిపురం మురగన్ షోరూమ్‌ను ప్రముఖ సినీనటి అనుపమ పరమేశ్వరన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అధునాతన ఫ్యాషన్ డిజైన్లు, వెరయిటీ శారీలతో ఏర్పాటు చేసిన షోరూమ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. వస్త్రాల కొనుగోలును ఆమె జ్యోతి ప్రజల్వనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కావటి మనోహర్ నాయుడు, జిల్లా పరిషత్ చైరపర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, ఎమ్మెల్యే మద్దాలి గిరి, డిప్యూటీ మేయర్ సజీలా తదితరులు హాజరు అయ్యారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- మంగళగిరి



తాడేపల్లి నులకపేటలో పక్షవాతం, బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వృద్ధ దంపతులు షేక్ కాలేషా, ఆషా కుటుంబానికి మంగళగిరి ఖిద్మత్ టీం కార్యాలయంలో సోమవారం టీం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. టీం కన్వీనర్ షేక్ షఫీ మాట్లాడుతూ వృద్ధుడు కాలేషా పక్షపక్షవాతంతో బాధపడుతుండగా ఆయన భార్య బ్రేస్ట్ కాన్సర్‌తో బాధపడుతుందని వీరిని మరి కొంతమంది దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని షఫీ విజ్ఞప్తి చేశారు.



కుంచనపల్లిలో ఇందేకర్మ రాష్ట్రానికి పోస్టర్‌చూపుతున్న నాయకులు

వ్యాపారులకు ఇదే ఖర్మ..

ప్రజాశక్తి-తెనాలి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనల్లో భాగంగా సోమవారం ఇందే ఖర్మ వ్యాపారులకు నినాదంగా నిరసన ర్యాలీ జరిగింది. మార్కెట్ కూడలి నుంచి మెయిన్ రోడ్డులో ర్యాలీ సాగింది. వ్యాపారులతో టిడిపి నాయకులు మాట్లాడుతూ వ్యాపారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలుసుకున్నారు. టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్ష కార్యదర్శులు డూండీ రాకేష్, ఈదర వెంకటపూర్ణచంద్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో వ్యాపారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పన్నుల మోతతో వ్యాపారులు తల్లడిల్లిపోతున్నారరన్నారు. అన్ని సమస్యలకూ పరిష్కారం రాష్ట్రంలో వైసిపి పాలనను పారదోలటమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నాబత్తుని జయలక్ష్మి, పెండేల వెంకట్రావ్, దేశు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో ..

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో సోమవారం రాత్రి టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం జరిగింది. వైసిపి పభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై అనేక భారాలు వేసిందని, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు టిడిపి నాయకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు కోలాంటి మహేష్, మారుమాక నీలాంబరం, మహిళా నాయకురాలు దాశెట్టి అరుణ, అమ్మిశెట్టి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

30 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం





ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని మహానాడులో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న 30 బస్తాల రేషన్ బియ్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. బియ్యంను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లి నుంచి గన్నవరానికి తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో నిందితులు తెలిపారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రేషన్ బియ్యం రీ సైక్లింగ్ అడ్డాగా మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లితో పాటు నియోజకవర్గం కేంద్రం రేషన్ బియ్యం రీ సైక్లింగ్ అడ్డాగా మారింది. పౌరసరఫరాల శాఖ చోద్యం చూస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపినీ చేస్తున్న పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కొన్ని కఠిన ఆంక్షలు ప్రభుత్వం విధించినప్పటికీ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతూనే ఉంది. సాంబామసూరి, బిపిటి సన్నరకాలు, నెల్లూరు సన్న బియ్యం, వాటిల్లో పీడీఎఫ్ బియ్యం కలిపి అమ్ముతున్నారు. ఇందుకు మంగళగిరి సమీపంలోని ఓ రైసు మిల్లులో రీసైక్లింగ్ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇక్కడ నుండే అన్ని జిల్లాలకు పీడీఎఫ్ బియ్యం కలిపి మంచి బ్రాండ్ గల సంచులలో నింపి సరఫరా చేస్తున్నారు. సివిల్ సప్లయ్ అధికారులు, టాస్క్ ఫోర్స్ అధికారులు ఒకటిరెండుచోట్ల నామమాత్రంగా దాడులు చేశారు. అయినా ఫలితం కనిపించడం లేదు. గ్రామాలు, పట్టణంలో పీడీఎఫ్ బియ్యం పంపిణీ చేస్తున్న జగనన్న వాహనంలోనే కిలో 8 నుండి 10 రూపాయల వరకు రేషన్ బియ్యం తీసుకోని వారికి డబ్బులిస్తున్నారంటేనే అక్రమ రవాణా ఏ స్థాయిలో జరుగుతుందో ఊహించుకోవచ్చు. కొంతమంది అధికారులు, అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి.

తాజాగా, మంగళగిరి నియోజకవర్గంలోని ఆత్మకూరు శంకర్ రైసు మిల్లులో నాలుగు రోజుల క్రితం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి 432 క్వింటాళ్ల రీ సైక్లింగ్ చేసిన రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు, దీనిని బట్టి మిల్లర్ల దందా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. నిత్యం ఈ దందా జరుగుతున్నా రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాల నుండి రేషన్ బియ్యం ఇక్కడికి తరలివస్తున్న సంబంధిత శాఖలకు మిల్లర్లు భారీ స్థాయిలో ముడుపులు చెల్లించి దాడులు జరగకుండా తమ పలుకుబడితో నిలువరించగలుతున్నారు. మామూళ్లు సమర్పించని సమయంలోనే దాడులు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా రేషన్ బియ్యం రీ సైక్లింగ్ చేస్తూ కోట్లాది రూపాయలు గడిస్తున్న, రైసు మిల్లులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అన్నా క్యాంటీన్ అగ్నిప్రమాదం కేసులో నిందితుడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ, సిఐ

ప్రజాశక్తి-తెనాలి

అన్నా క్యాంటీన్ అగ్ని ప్రమాదం కేసులో నిందితుడిని పట్టణ ఒన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిఐ కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్పీ కె.స్రవంతిరాయ్ వివరాలను వెల్లడించారు. ఈనెల 17 అర్ధరాత్రి మున్సిపల్ కార్యాలయం ఎదురుగానున్న అన్నా క్యాంటీన్‌కు దుండగులు నిప్పు పెట్టిన సంగతి విధితమే. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సిఐ కె.చంద్రశేఖర్, దర్యాప్తులో స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన సూరికొండ సీతారామయ్య అలియాస్ సైదులును నిందితుడిగా తేల్చారు. సీతారామయ్య మార్కెట్ ప్రాంతంలో తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తుంటాడు. అతనికి వరుసకు వదిన అయ్యే సునీత కూడా పండ్ల వ్యాపారం చేస్తోంది. సునీత ఇంటికి వెళ్లే టపుడు వ్యాపారానికి ఉపయోగించే స్టూలు, ఫ్రూట్స్ ఉంచే ప్లాస్టిక్ ట్రేలు, తట్టలు తదితరాలను అన్న క్యాంటీన్ వరండాలో ఉంచి వెళుతుంది. వీరిద్దరి మధ్య కొంత కాలంగా చిన్న చిన్న విబేదాలున్నాయి. ఆ ద్వేషంతో మద్యం సేవించి అర్ధరాత్రి అక్కడకు చేరిన సతారామయ్య అక్కడే ఉన్న చెత్తను వాటిపై వేసి నిప్పు పెట్టి పరారయ్యాడు. నిందితుడిని చాకచక్యంగా గుర్తించి, పట్టుకున్న సిఐ, ఎస్ఐ డేవిడ్‌రాజు, ఏఎస్ఐ రత్నరాజు, హెచ్‌సి ఎం.శ్రీనివాసరావు, పిసి ఎన్.శ్రీనివాసరావును డిఎస్పీ అభినందించారు.

ఆటోను ఢీకొట్టిన కారు- ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పుల్లారావు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల నుంచి కొండమోడు వైపువెళ్తున్న కారు, కొండమోడు నుంచి పిడుగురాళ్ల వెళ్తున్న ఆటోను ఢీకొంటింది. ఈ సంఘటనలో ఒక వ్యక్తికి, ఒక చిన్నారికి గాయాలయ్యాయని, వారిని నర్స రావుపేట ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తర లించినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనపైకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

అమరావతి సబ్ సెంటర్ -1లో బాలింతలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -అమరావతి

మండల కేంద్రమైన గ్రామపంచాయతీ కార్యాలయంలో బాలింతలకు అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు,బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని. సమయానికి వైద్య పరీక్షలు చేయించు కోవాలని కోరారు.

పెదకూరపాడులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి -పెదకూరపాడు

పెదకూరపాడు లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం లో టిడిపి నాయకులు ఇంటింటికి సోమవారం తిరిగారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు . ప్రజలు నిత్యవసర వస్తువుల దారులపై స్పందిస్తున్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమేష్, బెల్లంకొండ రామ్ గోపాల్ రావు, భాష్యం ఆంజనేయులు, వడ్లమూడి అప్పారావు, షేక్ ముంతాజ్, షేక్ అజ్మల్ల తదితరులు పాల్గొన్నారు.

టిప్పరు ఢీకొని ఒకరి మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

టిప్పరు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పుల్లారావు తెలిపిన వివరాల ప్రకారం... ఆర్‌ఆర్ సెంటర్‌కు చెందిన బండారు ఆంజనేయులు(26) పిడుగురాళ్ల నుంచి ఆర్‌ఆర్ సెంటర్‌కువస్తుండగా బైపాస్‌లో వస్తున్న టిప్పరు ఆంజనేయులను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆం జ నేయులు అక్కడిక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా - యువకుడు మృతి



ప్రజాశక్తి - మాచర్ల: వెల్దుర్తి మండలం గుడి పాడు చెరువు గ్రామంలో జరుగుతున్న చెరువు కట్ట పనులకు ట్రాక్టరుపై కూలికి వెళ్ళిన బొజ్జ ఆనందరావు (25) ట్రాక్టర్ బోల్తా పడి సం ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ట్రాక్టర్ పై మొత్తం ముగ్గురు ఉండగా మరొక యువకుడు మండ్లి బయ్యన్నకు తీవ్ర గాయా లయ్యాయి. మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథ మ చికిత్స అనంతరం ఎర్రయ్యను మెరుగైన చికిత్స కోసం గుం టూరు తరలించారు మాచర్ల జడ్పిటిసిగుడిపాడు చెరు వుకు చెందిన మండ్లి పెద్ద మల్లు స్వామి మాచర్ల ప్రభుత్వా సుపత్రిలో బాధితులను పరామర్శించి వారికి న్యాయం జ రిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్టు

పజాశక్తి-మంగళగిరి రూరల్: మంగళగిరి మండలం కష్టాయ పాలెం గ్రామ పరిధిలో గల పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను మంగళగిరి రూరల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.10180ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి :	32,957
మిర్చి ఎగుమతి :	30,707
మిర్చి నిల్వ :	10,844

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 25,500
నెం.5	18,000 - 26,000
273	10,000 - 22,000
341	12,000 - 25,000
4884	13,000 - 21,000
సూపర్ 10	14,400 - 20,000
నాన్ ఎసి	
తేజ	10,000 - 23,000
బడిగి	10,000 - 27,000
దేవనూరు డీలక్స్	11,500- 23,000
తాలుకాయలు	5,000 - 13,500
ఎసి	
334	12,000 - 26,000
నెం.5	17,000 -19,000
341	22,000 - 20,000
4884	19,500 - 20,000
తేజ	10,000 - 21,000
బడిగి	18,000 - 25,300
తాలుకాయలు	5,000 - 11,000



ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి : ఎస్పీ

ప్రజాశక్తి - నరసరావుపేట

స్పందన ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని స్పందన కార్యక్రమం పట్ల ప్రజలలో విశ్వాసం పెరిగేలా పోలీసులు కషి చేయాలని పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. స్పందనలో వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుండి అందిన ఫిర్యాదులను పరిశీలించి ఆయా పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు పంపి సత్వరమే పరిష్కరించాలని అదేశించామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) జి.బిందుమాధవ్,డిఎస్పీలు ఆదినారాయణ, విజయభాస్కర్ రావు, రవిచంద్ర,ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం కాజేయాలని చూస్తున్నారు



కొన్నేళ్ల క్రితం తన అత్త, ఇటీవల తన భర్త మృతి చెందగా తన అత్త వాటా 2.5 సెంట్లు స్థలాన్ని తన కుమార్తె పేరిట మార్చుకుందామని చూస్తే, ఆ స్థలాన్ని తమ సమీప బంధువు ముప్పాళ్ల మండలం నార్నె పాడు గ్రామానికి చెందిన అలపర్తి శ్రీనివాసరావు కాజేయాలని చూస్తున్నారని నరసరావుపేట మండలంలోని ఇక్కుర్రు గ్రామానికి చెందిన తాళ్లూరి హను మాయమ్మ ఫిర్యాదు చేశారు. తన అత్తకు వారసులు లేరని నకిలీ పత్రాలు సృష్టించి స్థలం కబ్జా చేశారని తనకు ఎటు వంటి ఆస్తిపాస్తులు లేవని న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావు వలన ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు.

కొడుకులు చూడడం లేదు



ఇద్దరు కొడుకులు, విద్యా బుద్ధులు నేర్పి పెంచి పెద్ద చేసి పెళ్ళిళ్ళు చేశాక భర్త చని పోయాడు. ఇద్దరికి చెరో ఇళ్ళు ఇవ్వగా పెద్ద కొడుకుకు సంబంధించిన ఇంట్లో ఒక గదిలో వేరుగా వండుకొని తింటూ ఉండగా పెద్ద కొడుకు కోడలు అనవసరంగా దుర్భాషలాడు తున్నారని చిన్న కొడుకు పట్టించుకోవడం లేదని, తనగదిలోకి వెళ్ళనీయకుండా ఉండేందుకు గోడ నిర్మించారని రొంపిచర్ల మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన కొలగాని సుబ్బాయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల సలహా మేరకు ఎస్పీకి ఫిర్యా దు చేశానని పేర్కొన్నారు. న్యాయం చేయాలని వేడుకున్నారు.

అప్పుల వాళ్లకు డబ్బులు చెల్లింపునకు వినతి

తన భర్త చెన్నుపాటి వెంకటా చార్యులు వ్యాపారం చేస్తానంటే తెలి సిన వాళ్ల దగ్గర ,బంధువుల దగ్గర రూ.6 లక్షలకు పైగా అప్పులు తెచ్చి ఇవ్వ డంతో పాటు తన పుట్టింటి వారు ఇచ్చిన 10 సవర్ల బంగారం కూడా తీసుకొని మరో మహిళతో వివా హేతర సంబంధం పెట్టుకొని తనకు అన్యాయం చేస్తున్నారని దాచే పల్లి మండలం శంకరాపురం గ్రామానికి చెందిన మౌనిక స్పం దనలో ఫిర్యాదు చేశారు న్యాయం చేయాలని కోరారు.

డబ్బులివ్వకపోగా బెదిరింపు

'ఇంటి నుండి ఉద్యోగం చేయండి డబ్బులు సంపాదించండి' అంటూ ఆన్లైన్లో పరిచయమైన మహిళ కలిగిట సునీత రాజా రూ.8.6 వేలు తీసుకొని మోసం చేసిందని నరసరావుపేటకు చెందిన పదముత్తం శ్రావణి స్పందన లోని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

'స్పందన'లో ఫిర్యాదులు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేసినా, చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 'స్పందన' కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం 'స్పందన' ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్య క్రమం జరిగింది. ప్రజలు తమ సమ స్యలను పరి ష్కరించాలని కోరుతూ సుమారు 110 మంది తమ అర్జీలను అధికారులకు అంద జేశారు. వినతి పత్రాలు సమర్పించి తమ సమ స్యలను తెలియజేశారు. పల్నాడు జిల్లా ప్రజల సమ స్యలను పరిష్క రించేందుకు కృషి చేస్తున్నామని జెసి అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరి ష్కరిం చడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్జీలు సమర్పించే నిమిత్తం వచ్చిన వారికి పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నిర్వాహకులు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రం నిర్వహించారు. ఈ సం దర్భంగా దాతలను జెసి అభినందించారు. ప్రజా ఫిర్యాదుల స్వీక రణ 'స్పందన ' కార్యక్రమానికి వచ్చే వారికి సామాజిక సేవ ద్వారాఅన్న దానం చేసేం దుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావా లని జెసి కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి, డిఆర్డిఎ పి.డి బాలునాయక్లు అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత జిల్లా అధికారులకు అందించి నియమిత సమయం లోపు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

ఒంటిపై పెట్రోల్ చల్లుకున్న వైసిపి నాయకుడు

మంచినీటి కుళాయి మంజూరు చేయట్లేదని ఆవేదన



తన ఇంటికి మంచినీటి కుళాయి మంజూరు చేయకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని పిడుగురాళ్లకు చెందిన కాంద్రకుంట వెంకటేశ్వర్లు స్పందనలో జిల్లా జాయింట్ కలె క్టర్కు విన్నవించారు. అనంతరం తన వెంట తెచ్చుకున్న పెట్రో లు ఒంటిపై చల్లు కున్నారు. దీంతో అధికారులందరూ ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. పక్కనే ఉన్న పోలీసులు అప్ర మత్తమై వెంకటేశ్వర్లు చేతిలోని పెట్రోలు లాగేసి అతన్ని పక్కకు తీసుకువెళ్లారు. ఒంటిపై పెట్రోల్ పోసుకోవాల్సిన అవసరం ఏమిటని అధి కారులు ప్రశ్నించగా తనది ఎస్టి కులమని, గతంలో ఎం వి టి సి గా పనిచేశానని ప్రస్తుతం వైసిపిలో కొన సాగుతున్నట్లు చెప్పారు. తన ఇంటికి మంచి నీటి కుళాయి మం జూరు చేయాలని ఎన్నోసార్లు కార్యాలయం చుట్టూ అధికారుల చుట్టూ తిరిగిన పట్టించుకోలే దని, తనను చిన్న చూపుతో చూస్తూ ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. అందుకే, తాను ఈ విధంగా చేయాల్సివచ్చిందని వాపోయారు. వెంకటేశ్వర్లు ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పా టు విషయంపై చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారు లను జెసి ఆదేశించారు.

స్థలం ఖాళీ చేయాలంటూ ఇబ్బంది పెడుతున్నారు



గల్లా రమణమ్మ

స్థలం ఖాళీ చేయాలని కొందరు ప్రైవేటు వ్యక్తులు దౌర్జన్యం చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని క్రోసూరు మండలం ఎర్ర పాలెం గ్రామానికి చెందిన పేదమహిళ గల్లా రమణ జెసికి ఫిర్యాదు చేశారు. గత యాభై ఏళ్లుగా ఆర్ అండ్ బి స్థలంలో నివాసముంటూ, బడ్డీ కొట్టు వ్యాపారం చేసుకుంటూ తన కుటుంబం జీవనం సాగించుకుంటున్నట్లు చెప్పారు. సుమారు 30 కుటుంబాలు ఆ స్థలంలో నివాసం ఉంటున్నారన్నారు. తాను సిపిఎంకు అనుకూలంగా ఉన్నాననే ఉద్దేశంతో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు తన బడ్డీ కొట్టును ఖాళీ చేయించేందుకు దౌర్జన్యం చేస్తున్నట్లు తెలిపారు. వైసిపి కండువా వేసుకుంటే జోలికి రామని, లేదంటే ఖాళీ చేయిస్తామని బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని క్రోసూరు తహశీల్దారును జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

ఔట్సోర్సింగ్ సిబ్బందికి జీతాలివ్వండి



ఎపి మోడల్ స్కూల్ అవుట్సోర్సింగ్ సిబ్బంది

పల్నాడు జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బందికి నవంబర్ మాసం జీతాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ మోడల్ స్కూల్ యూనియన్ నాయకులు వి. పేరయ్య, వెంకట్రావు, రామారావు తో కలిసి మరికొంద జెసికు విన్నవించారు. నవంబర్ మాసం జీతాలు ఇప్పటికీ రాకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని, కరోనా సమయంలో 4 నెలల 20 రోజులు పని చేసిన జీతం బిల్లు రాలేదని వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక పోతున్నా..

వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక పోతున్నానని ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన గుర్రపుసాల ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. కరోనా నేపథ్యంలో కుటుంబ,ఆరోగ్య అవసరాల దృష్ట్యా సత్తెనపల్లికి చెందిన వడ్డీ వ్యాపారి ఎన్. జోసెఫ్ స్టాలిన్ వద్ద రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నానని వడ్డీ చెల్లిసున్నట్లు చెప్పారు. ఇంటిని తన పేరిట తాకట్టు పెట్టాలని ఒత్తిడి చేయడంతో స్టాంపు పేపర్లపై తాను, తన భార్య వేలి ముద్రలు బలవంతంగా తీసుకున్నారని, ఈ నెల 12 న ఇళ్ళు ఖాళీ చేయించి కూల్చివేశారని చెప్పారు. వడ్డీ వ్యాపారి వేధింపుల నుండి కాపాడాలని వేడుకున్నారు.

తమ్ముడిని చంపి ప్రమాదంగా చిత్రీకరించారు..

పాల ఆటో డ్రైవర్ గా పని చేస్తున్న తన రెండో తమ్ముడు జొన్నలగడ్డ దేవదాసు (27) ను ఈ నెల 12 న రాత్రి పొట్లూరు గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు చంపి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లుగా చిత్రీకరించారని అన్న ఈపూరు మండలం బొగ్గరం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ నాగరాజు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసిన శావల్యాపురం పోలీసులు దర్యాప్తు వేగవంతం చేయడం లేదని, న్యాయం చేయాలని కోరారు.

రక్షణ కోం నవోదయ నగర్ వాసుల వినతి



నవోదయనగర్కు చెందిన బాధిత మహిళలు

నరసరావుపేట పట్టణంలోని నవోదయనగర్కు చెందిన రజక సామాజిక వర్గ వాసులకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం బాధితులు స్పం దనలో జెసికి ఫిర్యాదు చేశారు. అందరి వ్యక్తులు వ్యక్తిగత ఉద్దేశంతో అందరూ నడిచే దారిలో నడవనివ్వకుండా తమను అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రశ్నిస్తే కులం పేరుతో దూషించి దాడి చేస్తున్నారని, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని కాలనీవాసులకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మునగాల అజయ్కుమార్ తదితర కాలనీవాసులు ఫిర్యాదు చేయగా సంఘటనపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను జెసి ఆదేశించారు.

నకిలీ మిరప నారుతో మోసం..

నకిలీ మిరప నారతో మోసపోయి నష్టపోయామని తమకు న్యాయం చేయాలని కోరుతూ ఈపూరు మండలం ఊడి జిల్లా గ్రామానికి చెందిన చాగం రెడ్డి సైదులు రెడ్డి, మూలే కోటిరెడ్డి కొండారెడ్డిలు జెసికు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఈశ్వర నర్సరీ యజమాని వనిపెంట నాగిరెడ్డి వద్ద శాంభవి, టయో స్టార్, హాట్ సన్, నిత్య దేవి అనే వెరైటీ మిర్చి నారు మంచి దిగుబడి వస్తుందని నమ్మించి రైతులకు విక్రయించారని అన్నారు. నారు నాట్లు వేసి నెలలు గడిచినా పైరు ఎదగకపోవడంతో అనేక రకాల బలం మందులు, పొరుగు మందులు పిచికారి చేసిన లాభం లేకపోయిందని వివరించారు. ఎకరాకు లక్ష వరకు పెట్టుబడి పెట్టిన నష్టపోయామని తమకు న్యాయం చేయాలని కోరారు. వెంటనే విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ.మురళిని జెసి ఆదేశించారు.

వయోపరిమితి పెంచాలి



పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయోపరిమితిని ఐదేళ్లు పెంచాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ సుభాని ఆధ్వర్యంలో నాయకులు స్పందనలో జెసికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 తరువాత పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. నిరుద్యోగుల ఆశల మీద నిరుగార్చే విధంగాఈ రాష్ట్ర ప్రభుత్వం వయస్సు పరిమితిని పెంచకుండా నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమన్నారు. పోలీస్ శాఖ లో ఖాళీగా వున్న మొత్తం ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని ,కానిస్టేబుల్ ఎస్సై ఉద్యోగాల వయస్సు పరిమితిని పెంచాలని కోరారు. కానిస్టేబుల్ ఎస్సై పోస్టులకు 35 వరకు పెంచాలని డిమాండ్ చేశారు. వయోపరిమితి పెంచని పక్షంలో రాబోయే కాలంలో అభ్యర్థులను పెద్ద ఎత్తున సమీకరించి 'చలో సిఎం' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.



వక్ఫ్‌బోర్డు భూములను పరిరక్షించండి

పల్నాడు జిల్లాలో వక్ఫ్ బోర్డు భూముల వివరాలు పూర్తిగా ప్రజ లకు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఎంఐఎం జిల్లా అధ్యక్షులు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో నాయ కులు జెసికు వినతిపత్రం సమర్పించారు.పల్నాడు జిల్లాలో వక్ఫ్ బోర్డు భూముల వివరాలను సమగ్రంగా ప్రజలకు తెలియజేయాలని కోరారు. జిల్లాలో అన్యా క్రాంతమవుతున్న వక్ఫ్ భూములను పరిరక్షించాలని కోరారు.

కలెక్టర్ స్పందనకు 150 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి


ప్రజాశక్తి-గుంటూరు

స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, పరిష్కరించిన అర్జీలు రీఓపెన్ అవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాల్లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జెసి రాజకుమారి, సహాయ కలెక్టర్ శివనారాయణశర్మ, డిప్యూటీ కలెక్టర్ లలిత, డిఆర్ఓ కె.చంద్ర శేఖరరావు పాల్గొన్నారు.ఈ స్పందనలో 150 మంది అర్జీదారులు పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతులను అందజేశారు.

అంధుల ఇంటిని ఆక్రమించిన ప్రభుత్వ ఉద్యోగి..



అంధులమైన తాము కొనుగోలు చేసిన చేసిన ఇంటిని అక్రమంగా ఆక్రమించి, ఖాళీ చేయట్లేదని, తమకు న్యాయం చేయాలని తెనాలి మండలం, చినరావూరికి చెందిన అంకం రామచంద్రరావు కోరాడు. తన కుటుంబ సభ్యులు, విజువల్లీ ఛాలెంజ్‌డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులతో కలిసి స్పందనలో అర్జీ అందజేశాడు. చినరావూరిలో వెచ్చ రాజేశ్వరి వద్ద నుండి ఈ ఏడాది జులైలో ఇంటిని బ్యాంక్‌లోన్ పెట్టి కొనుగోలు చేశానని, మేము ఇంట్లో లేని సమయంలో ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి కైలా సువర్ణలత పాల్ అండ్ కుటుంబ సభ్యులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లారని, సిసి కెమెరాలు, కుక్కలు ఉంచి భయపెడుతున్నారని తెలిపారు. ఇది మాఇల్లని, ఖాళీ చేయాలని కోరామని, దిక్కున్నచోట చెప్పుకోమని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై తెనాలిలోని 1వ పట్టణ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. కావున జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో రామచంద్రరావు భార్య శ్రీలక్ష్మి, విజువల్లీ ఛాలెంజ్‌డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు వై.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



తుపాను పంట నష్టాన్ని నమోదు చేయాలి

ఇటీవల వచ్చిన మాండూస్ తుపానుకు పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి, పరిహారం అందించాలని తదితర సమస్యలపై రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు స్పందనలో అర్జీ అందచేశారు. అలాగే ధాన్యం కొనుగోలులో తేమ శాతం నిబంధనలు సడలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కల్తీ విత్తనాల బారిన పడిన ఫిరంగిపురం మండలంలోని తక్కెళ్లపాడు, గరుడా చలపాలెం, వేములూరిపాడు, వేమవరం, పొనుగుబాడు గ్రామాల్లో తులసీ సీడ్స్‌కు చెందిన అకీరా రకం పత్తి విత్తనాలు వాడి, పంటలు పండక నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. తుపాను ప్రభావిత పంటను లెక్కించమని సచివాలయ సిబ్బందిని అడుగుతుంటే తమకు ఉత్తర్వులు రాలేదని అంటున్నారన్నారు. ఇంత వరకూ రైతుల పేర్లు నమోదు చేయలేదన్నారు. జిల్లాలో సుమారు 20వేల ఎకరాలు వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లిందని, వారందరికీ పరిహారం చెల్లించాలని కోరారు. అదే విధంగా గతేడాది దాన్యం కొనుగోలుకు సంబంధించి ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు ఇంత వరకూ చెల్లించలేదన్నారు.రైతుల పంట రవాణాకు వీలుగా చినరావూరు-జంపని రైల్వే గేటు 257ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మేకలవాగులో పూడిక తీత, పిచ్చికంప, తూటాకు తొలగించి ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమానులో నష్టపోతున్న పొలాలను కాపాడాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో రైతు సంఘం కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, ఎం. శివసాంబిరెడ్డి, యం.నాగమల్లేశ్వరరావు, ఎం.వెంగళరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, సుబ్బయ్య తదితరులున్నారు.



కాంప్లెక్స్ నిర్మాణంలో హరేకృష్ణ సొసైటీ తీవ్ర జాప్యం

స్థానిక మంగళదాస్ నగర్‌లోని హరేకృష్ణ హోల్‌సేల్ మార్కెట్ సొసైటీ పేరుతో జరుగుతున్న షాపింగ్ కమ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంలో జాప్యం, అక్రమాలకు పాల్పడుతున్న సొసైటీపై చర్యలు తీసుకోవాలని హరేకృష్ణ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పందనలో అర్జీ అందచేశారు. ఏడేళ్ల క్రితం 450 మంది సభ్యులు సుమారు 525 యూనిట్లు కాంప్లెక్స్‌లో కొనుగోలు చేశామని, రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నా సొసైటీ వారు రెండు గ్రూపులుగా ఏర్పడి, పోట్లాడుకుంటూ, నిర్మాణం కోసం ఇచ్చిన డబ్బును ఇష్టానుసారం లెక్కలు లేకుండా ఖర్చు చేస్తూ నిర్మాణం జాప్యం చేస్తున్నారన్నారు. సుమారు రూ.200 కోట్ల విలువైన ఈ ప్రాజెక్ట్ 2015లో మొదలై ఇప్పటికీ 50 శాతమే పూర్తి అయ్యిందన్నారు. సొసైటీని నమ్మి మోసపోయామని, తమకు న్యాయం చేయాలని కోరారు. అర్జి ఇచ్చిన వారిలో అసోసియేసన్ నాయకులు ఎం.నాగమల్లిఖార్జునరావు,యం.సాయిబాబు, కె.దుర్గా ప్రసాద్ తదితరులున్నారు.

తెనాలి సబ్ కలెక్టర్ స్పందనకు ఆరు అర్జీలు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం ఆరు ఆర్జీలు దాఖలైనట్లు సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. వాటిలో ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబందించి రెండు, పోలీసు శాఖకు సంబందించి, రిజిస్ట్రేషన్ రద్దుకోరుతూ, ఇంటి పన్ను, సదరం సర్టిఫికేట్ కోరుతో ఒక్కో ఆర్జీ చొప్పున దాఖలైనట్లు చెప్పారు. వాటిని పరిశీలించి, పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు పంపుతున్నా మన్నారు. స్పందనలో సబ్ కలెక్టర్ కార్యాలయం సిబ్బందితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థలోని కమిషనర్ ఛాంబర్‌లో స్పందన, సచివాలయ కార్యదర్శులతో జూమ్‌ద్వారా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం 16, ఇంజినీరింగ్ విభాగం 14, ప్రజారోగ్య విభాగం 10, రెవెన్యూ విభాగం 5 ఫిర్యాదులు మొత్తం 45 ఫిర్యాదులు అందాయి. తొలుత కమిషనర్ జూమ్‌ద్వారా సచివాలయాల కార్యదర్శులతో మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజలకు నిర్దేశించిన గడువులోగా మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ మూర్తి , సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

మహిళల హక్కులూ మానవ హక్కులే..



మాట్లాడుతున్న ఎల్ అరుణ. ప్లకార్డులు చూపుతూ నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి మంగళగిరి రూరల్

మహిళల హక్కులు మానవ హక్కులుగా గుర్తించాలని మహిళలకు సమాన హక్కులు, గౌరవం ఇవ్వాలని మంగళగిరి రూరల్ కాజా గ్రామ పంచాయితీ వెంకటరెడ్డి పాలెంలో సోమవారం మహిళలు ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ దిశా, నిర్భయాలాంటి చట్టాలు ఎన్ని ఉన్నప్పటికీ నిందితులను శిక్షించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని దిశ ఘటన జరిగి 10 సంవత్సరాలు అయినాప్పటికీ బాధితులకు ఇంతవరకు న్యాయం జరగలేదని అన్నారు. చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని నిందితులను కఠినంగా శిక్షించాలని అన్నారు. మహిళలకు రక్షణ భద్రత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి రూరల్ కార్యదర్శి ఎస్. విజయలక్ష్మి, సింహాద్రి సుమ, కోటేశ్వరమ్మ నిర్మల, అవుతు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కాలనీ వాసులకు కరపత్రాలు అందజేస్తున్న సిపిఎం నాయకులు

చెత్తపన్ను బలవంతపు వసూలు నిలిపేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి జోనల్ పరిధిలో ప్రజల నుండి బలవంతంగా చెత్త పన్ను వసూలు చేయడాన్ని సిపిఎం కొత్తూరు శాఖ కార్యదర్శి డి.విజయభాస్కర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆ మేరకు కొత్తూరులో సోమవారం ఇంటింటింటికి తిరిగి కరపత్రాలు పంపిణి చేశారు. నగరపాలక సంస్థ అధికారులు ఆస్తి విలువ ఆధారంగా పన్నులు పెంచడం సరికాదన్నారు. డ్వాక్రా గ్రూప్ యానిమేటర్లు, సచివాలయ వార్డు సెక్రటరీలు చెత్త పన్నుల పేరుతో బలవంతంగా వసూలు చేయించడం మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, బి.సుబ్బారావు, బి. యోహాను, కె.వెంకటయ్య పాల్గొన్నారు.


సభలో తానా అధ్యక్షులు లావు అంజయ్య చౌదరి,తదితరులు

భారతీయ కళలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం

కెఎల్‌యులో ఘనంగా తానా సదస్సు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

అంతరించిపోతున్న భారతీయ కళలను ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టినట్లు తానా అధ్యక్షులు లావు అంజయ్య చౌదరి అన్నారు. సోమవారం కెఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కనుమరుగవుతున్న కళలను, కళారూపాలను కాపాడేందుకు చైతన్య స్రవంతి పేరుతో తానా వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. సాంరస్కృతిక కళోత్సవాలలో బాగంగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలను, భారతీయ వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలనే దృఢ సంకల్పంతో తానా ముందుకు వెళుతుందన్నారు. తానా కో -ఆర్డినేటర్ రాజా కసుపతి మాట్లాడుతూ ఆధునిక యుగంలో తెలుగువారి సాంప్రదాయాలు ప్రతిబింబించే విదంగా ప్రజలను చైతన్య పరచడానిక తానా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల నుండి వచ్చిన కళాకారులు చేసిన కళా విన్యాసాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా డప్పు కాళాకారులు, నృత్య కాళాకారిణులు చేసిన నృత్యాలు, కోలాటం, చెక్క బజన వంటి అనేక కళా రూపాలు విశ్వవిద్యాలయ ప్రాంగంణంలో అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రొ.విసి.డాక్టర్ ఎన్.వెంకట రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి విబాగం సంక్షేమ విబాగం డీన్ చప్పడి హనుమంతరావు, సలహాదారు, హబీబుల్లాఖాన్, సలహాదారు కెఆర్.ఎస్.ప్రసాద్, సాక్ అసోసియేట్ డీన్ రూతు రమ్య, రమేష్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ రమేష్ బాబు, రమేష్ హాస్పటల్ చైర్మన్ డాక్టర్ రామ్మోహన్ రావు, మహిళా తానా కో -ఆర్డినేటర్ ఉమాపతి, ఆలిండియా మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ జెబిఆర్, ఆంధ్ర ఆర్ట్స్ అదినేత గోనా నారాయణరావు, ఆలిండియా హెల్త్ కేర్ సభ్యులు కళ్యాణి, కో-ఆర్డినేటర్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో వైద్య సేవలు అందించండి

నవజాత శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి



చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ప్రజాశక్తి-నరసరావుపేట

ఏరియా వైద్యశాలకు వైద్య సేవల కోసం వచ్చే పేద రోగులకు వైద్య సిబ్బంది అంకిత భావంతో సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక లింగం గుంట్ల పరిధిలోని డాక్టర్ వైయస్ఆర్ జిల్లా 200 పడకల వైద్యశాలలో సోమవారం నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్ షిప్ తో ఏర్పాటు చేసిన ఈ యూనిట్ ను రూ.28 లక్షల వ్యయంతో నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని పల్నాడు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో అప్పుడే పుట్టిన శిశువుల్లో వచ్చే సమస్యలు, నెలల నిండకుండానే జన్మించే చిన్నారుల వైద్యం నిమిత్తం ఇది ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక ఆటోమేటిక్ ల్యాబ్ అందుబాటులో ఉందని అన్ని రకాల పరీక్షలు వెంటనే చేసేలా సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రోజుకు 1000 మంది వరకు ఒపి వస్తున్నారని చెప్పారు. అంకిత భావంతో మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా రానున్న రోజుల్లో ఒపి సంఖ్య 1500కు పెరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్ళి అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఆసుపత్రి అవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రంగారావు, హాస్పిటల్ డెవప్‌మెంట్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



మొక్కల పెంపకం బాధ్యతగా తీసుకోండి

ప్రజాశక్తి-ఈపూరు

మానవ మనుగడకు మొక్కలు అవసరమని వైద్యులు కమలాకర్ అన్నారు. డిఆర్వో ఎం. హరికుమార్ ఆదేశాల మేరకు జగనన్న పచ్చ తోరణం కార్యక్రమంలో భాగంగా ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యులతో కలిసి ఫారెస్ట్ అధికారులు సోమవారం మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్ల మీసాల చెంచయ్య,వైద్యులు సుధాకర్,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఎ నాగే శ్వరరావు,కె.వెంకటేశ్వర్లు,షేక్ నన్నేసాహెబ్, ఫార్మసిస్ట్ రామారావు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపిడిఓ కార్యాలయంలో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి-యడ్లపాడు

మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ పిడతల ఝాన్సీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వై హనుమారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్లు కె ఏసురత్నం, పి సుందరరావు క్రిస్మస్ పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమ నిర్వహణ ప్రక్రియను చేపట్టిన ఉపాధిహామీ పథకం టెక్నికల్ ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట తరపున స్థానిక చెంఘిజ్ ఖాన్‌పేటలోనిలోని లెప్రసి కాలనీ వాసుల కోసం సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. డాక్టరు గట్టు రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ముందుగా పాస్టర్ కృష్ణ ,ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



కొలతలు పరిశీలిస్తున్న జె ఈ శ్రీనివాస్‌రెడ్డి

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఏపీ మోడల్ స్కూల్ లో నాడు నేడు నిధులతో జరుగుతున్న భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ జె ఈ శ్రీనివాస్ రెడ్డి సోమవారం పరిశీలించారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ. 96 లక్షల నిధులతో ఎనిమిది అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అలాగే, ఏపీ మోడల్ స్కూల్ నూతన భవన నిర్మాణానికి నాడు-నేడు నిధులు రూ.3.09 కోట్లు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్న క్రమంలో ప్రాథమిక దశలో భవన నిర్మాణాల నాణ్యత ప్రమాణాలను,కొలతలు తీసి పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచ నలు చేశారు.మండలంలోని అగ్నిగుండాల, ఇనిమెల్ల గ్రామా ల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలు జరుగుతున్నట్లు చెప్పారు. జెఇతో పాటు పంచాయతిరాజ్ ఏఈ భాస్కర్ బాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ప్రతి పేద విద్యార్థికీ బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి

ఈ నెల 21న ముఖ్యమంత్రి వై. ఎస్.జగన్మోహనరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంత్రి అంబటిరాంబాబు సోమవారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా ఆయన పట్టణంలోని పలు వృద్ధాశ్రమాలలో వృద్ధులకు 60 దుప్పట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాటశాలలో పుస్తకాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు చదువే ఒకఆయుధం అని నాణ్యమైన విద్యను ప్రతిఒక్కరికీ అందించాలన్న ధృడ సంకల్పంతో నూతన ప్రణాళికలను రచించి ప్రతి పేద విద్యా ర్థి బంగారు భవిష్యత్తుకు మార్గాలు వేశామన్నారు.విద్యలో అమ్మాయిలే ముందంజలో వుండటం సంతోషకరమని, ప్రతి విద్యార్థినీ ఉన్నతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు సాంబశివరావు , కౌన్సిలర్ ఎ శివప్రసాద్ , వైస్‌చైర్మన్లు షేక్ నాగుల్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్ , ప్రధాన ఉపాధ్యాయురాలు జి విజయకమల పాల్గొన్నారు .

'రంగస్థలి' పాటల పోటీల్లో 'వాగ్దేవి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నరసరావుపేట



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు

ఈ నెల 18 న పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్ లో పట్టణంలోని అన్ని ఇంటర్ మరియు డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు, నరసరావుపేట రంగస్థలి నిర్వహించిన పాటల పోటీలలో వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థినిలు మరియు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తమ ప్రతిభ చాటిన కె.స్వాతి,ఎన్. జైనమేరీ లను కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ లు కాట్ల రామ కోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, మద్దుల కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు,ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, అధ్యాపకులు ,సిబ్బంది అభినందించారు.

'పథకం ప్రకారమే మాచర్లలో విధ్వంసాలు'

ప్రజాశక్తి-నరసరావుపేట



మాచర్లలో హింసాత్మకమైన సంఘటనలకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన వైసి పి గుండాలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. మాచర్ల ఘటనలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో నరసరావుపేట లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే పిన్నెల్లి మాచర్ల సిఐని శెలవుపై పంపించి పథకం ప్రకారం టిడిపి కార్యకర్తలపై దాడులు చేయించారన్నారు. దాడులకు ముందు టిడిపి నాయకులు పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మాచర్లలో జరిగిన హింసాత్మక ఘటనలో షేక్. మీరావలి, బీసీ సామాజిక వర్గానికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారన్నారు. మాచర్ల ఘటన ముమ్మాటికీ జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి వైఫల్యమేనని అన్నారు. జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి నియంత్రణలో పూర్తిగా విఫలమయ్యారని, పిన్నెల్లి అనుచరులుగా పోలీసుల తీరు ఉందన్నారు.బాధ్యతాయుత పదవిలో ఉంటూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఏకపక్షంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. అనంతరం చదలవాడ అరవిందబాబు మాట్లాడారు.

'అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ'

ప్రజాశక్తి-చిలకలూరిపేట



స్థానిక 20వ వార్డులో పారిశుద్ధ్య పనుల నిర్వహణ అధ్వానంగా ఉందని పాత 16వ వార్డు మాజీ వైస్ చైర్మన్ బద్రినాథ్ విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న 20వ వార్డు కౌన్సిలర్ పని తీరుపై విమర్శలు గుప్పించారు. ఆ వార్డులో మురుగు కాల్వల్లో నీరు పారుదల లేక దుర్వాసన వెదజల్లుతోందని, దోమల తీవ్రత కారణంగా స్థానికులు ఇబ్బందిపడుతున్నారని అన్నారు. విశ్వబ్రాహ్మణ వీధిలోని మురుగు కాలువల పరిస్థితి గురించి పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. మురుగునీరు పారకుండా అడ్డంగా పెద్ద బండరాళ్ళు వున్నాయని, దాదాపు నెలాపదిహేనురోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని చెప్పారు. ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.మున్సిపల్ చైర్మన్, కమిషనర్, డీఈ, ఏఈ, ,మునిసిపాలిటి అధికారులు కానీ, సచివాలయ సిబ్బంది గాని వచ్చి చూడకపోవడం దురదృష్టకరమన్నారు. స్థానికంగా పరిపాలనా తీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవడానికి ఇదే ఉదాహరణ అని అన్నారు. ఇప్పటికైనా వార్డు ప్రజ ల సమస్యలను పరిష్కారించాని డిమాండ్ చేశారు.

కోటనెమలిపురిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - రాజుపాలెం

మండలంలోని కోటనెమలిపురి గ్రామంలో రైతు భరోసా కేంద్రం లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని , జడ్‌పిటిసి దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు పండించే ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకోవాలని, బైట దళారులకు విక్రయించి మోసపోవద్దని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పి.వెంకటనర్సయ్య మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని విక్రాయించదలచిన రైతులు ముందస్తుగా పంట నమోదు , ఈ-కేవైసి పూర్తి చేసుకొన్న రైతులు మాత్రమే విక్రయించుటకు అర్హులు అని తెలిపారు. రైతు భరోసా కేంద్రం లో వరి ధాన్యాన్ని నాణ్యత పరీక్షలు చేయించి, ప్రభుత్వం ప్రకటించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లయితే విక్రయించేందుకు రైతు భరోసా కేంద్రం లో రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు.కార్యక్రమంలో జీడీసి బ్యాంక్ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, స్థానిక ఎం.పి.టి.సి సభ్యులు ఉడుముల వీరంజనేయ రెడ్డి, బాసు లింగా రెడ్డి,వి. వి.ఏ జయలక్ష్మీ, జి.డి.సి.సి. సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ఉద్యోగానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - రాజుపాలెం

రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజుపాలెం1 బలిజేపల్లి 1, అంచుల వారిపాలెం 1, ఖాళీగా ఉన్న మూడు ఆశా కార్యకర్తలు పోస్టులు భర్తీకి దరఖాస్తులు స్వకరిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ కె. వి.కష్ణ కుమార్ తెలిపారు. దరఖాస్తులు పంపేందుకు ఈ నెల 21 చివరితేదీ అని, వివరాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి- రెంటచింతల

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పల్నాడు జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు 2022-23 విద్యా సంవత్సరానికి గాను అవుట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేయుటకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ తెలిపినట్లు రెంటచింతల ఏపీ టీ డబ్ల్యూ ఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు దరఖాస్తుదారులు పీజీ, డిగ్రీ బీడీ ఉత్తీర్ణతోపాటు 50 శాతం మార్కులు కలిగి ఉండి పల్నాడు జిల్లా వాసులై ఉండాలని ఆయన తెలిపారు అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోపు సంబంధిత సర్టిఫికెట్లతో రెంటచింతలలోనే ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్లో సంప్రదించాలన్నారు.

108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో 108 ఉద్యోగులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే తప్పని పరిస్థితుల్లో సమ్మెకు వెళతామని జెఎసి ఆఫ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, టీచర్స్ అండ్ లెక్చరర్స్ కో-ఛైర్మన్ బి.లక్ష్మణరావు, సెక్రెటరీ జనరల్ బి.ముత్యాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 108 అంబులెన్స్‌ల ద్వారా 24x7 ప్రజలకు ఉచిత, అత్యవసర వైద్య సేవలు అందిస్తున్న ఇఎంటి, పైలెట్‌లకు ప్రతినెలా జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యమవుతోందని, నిర్వహణ సంస్థ అయిన ఎఐఎంఎస్ అధికారుల వేధింపులు కారణంగా ఉద్యోగం ఎప్పుడు ఉంటుందో? ఎప్పుడు తొలగిస్తారో? తెలియని పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. చిన్నచిన్న కారణాలకే ఎలాంటి విచారణా లేకుండా బదిలీలు చేస్తూ, టెర్మినేషన్ వంటి నిర్ణయాలు తీసుకుంటూ ఇప్పటికే యాజమాన్యం అనేక మందిని దూరం చేసిందని విమర్శించారు. జీతం పెరిగిందనే సంతోషక కంటే ఉద్యోగ భద్రత సమస్య ఎక్కువగా ఉందని, ఉద్యోగులకు యాజమాన్యం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలలో ఇప్పటికీ అమలు చేయకుండా దాటవేత ధోరణి కనిపిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరంగా, సంస్థ పరంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులు ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

ధర్నా చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు



బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులకు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సవరణను తక్షణమే చేపట్టాలని, తదితర సమస్యలపై ఆలిండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం గుంటూరులోని సంస్థ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి జాతీయ ప్రధాన కార్యదర్శి వి.వరప్రసాద్ సమర్పించిన సమాధాన పత్రాన్ని జిల్లా కార్యదర్శి బాబురావు ధర్నాలో చదివారు. ప్రజలు, రైతులు, పెన్షనర్ల సమస్యలపై కేంద్ర ప్రభుత్వ తీరుకు బాధితులు తెలుపుతున్న నిరసనలను ప్రభుత్వం లెక్కచేయట్లేనది నాయకులు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో అసంతప్తికి అంతిమరూపం ఎన్నికలలో పాలకవర్గ మార్పని జిల్లా అధ్యక్షులు సంగిరెడ్డి హనుమంతరెడ్డి అన్నారు. సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని పెన్షనర్లు, ఉద్యోగులు కలిసి ఎదుర్కోవాలని రాష్ట్ర ఉపాధ్యకులు సిహెచ్.వెంకటేశ్వర్లు చెప్పారు. ధర్నాలో రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గంటా నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే జనవరి, ఫిబ్రవరిలో ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతాయని ప్రకటించారు.

ఆర్‌విఆర్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు



మేడా శ్రీకాంత్

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మేడా శ్రీకాంత్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఏన్ ఇంటిగ్రేటెడ్ మెషీన్ లెర్నింగ్ అప్రోచ్ ఫర్ హార్ట్ డిసీజ్ క్లాసిఫికేషన్ అండ్ కేటగరైజేషన్' అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ బి.రవీంద్రబాబు పర్యవేక్షణలో పరిశోధనకుగాను పిహెచ్‌డి పొందారు. కళాశాలలో పిహెచ్‌డి కలిగిన స్టాఫ్ 125 మంది ఉన్నారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ఈనెల 21వ తేదీ బుధవారం సిఎం జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పెదనందిపాడు ఎస్సీ, ఎస్టీ బాలుర హాస్టల్లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాసిం పీరా(మేస్త్రి) సోమవారం విలేకరులకు తెలిపారు. అనంతరం స్థానిక జడ్పీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలను ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ప్రారంభించనున్నట్లు తెలిపారు.



విద్యార్థినిని అభినందిస్తున్న జూపూడి రంగరాజు, తదితరులు

క్రాఫ్ట్ పోటీలో హిందూ ఫార్మసీ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన 'ఏఎన్‌యు సృజన్' క్రాఫ్ట్ తయారీ పోటీలో హిందూ కాలేజి ఆఫ్ ఫార్మసీ విద్యార్థిని శ్రీవర్ధిని మొదటి బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. ఫార్మా డి.నాల్గవ సంవత్సరం చదువుతున్న శ్రీవర్ధిని డిసెంబర్ 15 నుండి 17 వరకూ ఏఎన్‌యులో నిర్వహించిన యువజనోత్స వాలలో పాల్గొని ప్రతిభ చూపిందన్నారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థినిని కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు, డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, హెచ్‌ఓడి జి.సదాశివరావు, ఫిజికల్ డైరెక్టర్ లెఫ్టినెంట్ సి.హెచ్. అజిత్ బాబుకుమారి అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వి.కౌసల్యాదేవి

బిహెచ్ కాలేజీకి ఓవరాల్ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి-గుంటూరు

నాగార్జునా యూనివర్సిటీలో జరిగిన అంతర్ కళాశాలల పోటీలలో అన్ని విభాగాల్లో స్థానిక బిహెచ్ కాలేజి విద్యార్థినులు పలు బహుమతులు పొంది ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ సాధించారు. బృంద నృత్యంతోపాటు, థియేటర్ ఆర్ట్స్, ఏకపాత్రాభినయం, మ్యూజిక్ విభాగాల్లో తమ విద్యార్థులు ప్రథమ బహుమతులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కౌసల్యాదేవి తెలిపారు. సోమవారం ఆయా విద్యార్థినులను, టీమ్ మేనేజర్ రాధామాధవిని కళాశాల అధ్యక్షులు డాక్టర్ బి.వి.విజయభాస్కర్, కార్యదర్శి చేగుశ్రీదర్, ప్రన్సిపాల్ అభినందించారు.



సాదియాను అభినందిస్తు మేయర్ మనోహర్ నాయుడు

స్కేటింగ్‌లో షాదియాకు సిల్వర్

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ గెలిచిన షేక్ షాదియాను నగర మేయర్ కావటి శివనాగమనోహం నాయుడు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. 10వ తేదీ నుండి బెంగుళూరులో జరుగుతున్న నేషనల్ స్కేటింగ్ పోటీలలో 5-7 సంవత్సరాల విభాగంలో గుంటూరు నగరం, 20వ డివిజన్ నల్లచెరువుకు చెందిన షేక్ షాదియా సిల్వర్ మెడల్ సాధించుట ఎంతో అభినందనీయమని మేయర్ అన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని కోచ్ షేక్ ఖాజా, విద్యార్థిని తండ్రి షేక్.మీరావలి తదితరులు పాల్గొన్నారు.

హ్యాకథాన్‌లో కిట్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు మెగా చెక్కును అందచేస్తున్న కిట్స్ ఛైర్మన్ సుబ్బారావు

ప్రజాశక్తి-గుంటూరు:కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ సంయుక్తంగా రాష్ట్ర వ్యాప్తంగా విభిన్న ప్రాంతాల్లో నిర్వహించిన హేకథాన్ పోటీల్లో కిట్స్ కళాశాలకు చెందిన ఐదు బృందాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులు వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్ సోమవారం తెలిపారు. కంపెనీ మానవ వనరుల శాఖ అధికారి రాజారమేష్ గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.12 వేలు, తృతీయ బహుమతిగా రూ.8 వేలు అందచేశారు. విజేతలకు బహుమతులతో పాటు, వారి సాంకేతిక నైపుణ్యాన్ని గుర్తించి 19 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తూ నియామక పత్రాలు అందజేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. విజేతలకు కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్, డైరెక్టర్ డాక్టర్ హరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు అభినందించారు.

స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర భావి తరాలకు తెలియాలి



మాట్లాడుతున్న సయ్యద్ నసీర్ అహ్మద్ , తదితరులు

ప్రజాశక్తి -మేడికొండూరు

స్వాతంత్ర్య సమరయోధుల సేవలను భావి భారత పౌరులైన విద్యార్థులకు తెలియజేయాలని ఇంటెల్ హై స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్లో సోమవారం గ్రంథాలయ ప్రారంభోత్సవం, నామకరణ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత, చారిత్రక విశ్లేషకులు సయ్యద్ నసీర్‌అహ్మద్ హాజరై మాట్లాడారు. 1927 డిసెంబర్ 19న స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారి పైన తిరుగుబాటు చేసి, ఉద్యమించిన నాయకులను అప్పటి బ్రిటిష్ పరిపాలకులు ఉరిశిక్ష విధించారుని తెలిపారు. అలాంటి చరిత్ర కలిగిన వారిలో పండిత్ రాంప్రసాద్ బిస్మిల్ - అల్ఫా ఖుల్లా ఖాన్ ఇద్దరి పేర్లను గ్రంథాలయానికి పెట్టడం మంచి శుభ పరిణామం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ హై స్కూల్ ప్రిన్సిపల్ కోనూరి రాణి జయకుమార్, గ్రంథాలయ ఇంచార్జ్ కోనూరు తేజ బాబు, సౌమ్య, హై స్కూల్ స్పోర్ట్స్ ఇంచార్జ్ షేక్ రన్ను హుస్సేన్ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పరిశుద్ధబాబును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సాంఘిక నాటక కళాకారుడు పరిశుద్ధబాబుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో శకపురుషుని శతజయంతి పేరిట మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సావాల్లో భాగంగా సోమవారం ఎన్టీఆర్ నటించిన మంచికి మరోపేరు చిత్రాన్ని ఉచింతగా ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల పండుగలో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ సాంఘిక నాటక కళాకారుడు కర్రి పరిశుద్ధబాబును ఉత్సవ కమిటీ సభ్యులు పంచుమర్తి భాస్కరరావు, బిట్రా యుగందర్, రాచాబత్తుని వీరయ్య, కంచాల అంకారావు, ఎస్.సాంబశివరావు సత్కరించారు. కార్యక్రమంలో పి.పోతురాజు, డి.భవాని, జగన్, ఎం.రాఘవరావు, ఎం.శ్రావణ్, మహేష్ పాల్గొన్నారు. మంగళవారం వద్దంటే డబ్బు చిత్రాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.



ఇస్త్రీ బండిని అందజేస్తున్న టిడిపి నాయకులు

ఇస్త్రీ బండి అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి

పట్టణానికి చెందిన డి.వీరాంజనేయులుకు స్థానిక టిడిపి నాయకులు ఇస్త్రీ బండి అందజేశారు. జీవనోపాధి ఇబ్బందిగా ఉందని తమకు ఇస్త్రీ బండి అందజేయాలని నారా లోకేశ్‌కు అర్జీ అందజేయడంతో ఆయన వెంటనే స్పందించారు. స్థానిక నాయకులతో ఈ బండిని పంపిణీ చేయించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి డి.దాసు, ఎస్.అశోక, డి.వేణుగోపాలరావు, టి.శ్రీను, ఎం.ఈశ్వరి, సిహెచ్.శివుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

పట్టణ పరిశుభ్రతకు ప్రతిజ్ఞ

ముగిసిన క్లాప్ వారోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగపరిచేందుకు గత వారం రోజులుగా నిర్వహిస్తున్న క్లీన్ ఆంధ్రప్రదేశ్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పురపాలక సంఘ కార్యాలయం వద్ద కమిషనర్ ఎం.జస్వంతరావు అధ్యక్షతన నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పురపాలక సంఘ సిబ్బంది, స్థానికులతో ఆమె పట్టణ పరిశుభ్రతకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో వ్యాపార కూడళ్ళ నిర్వాహకులు వ్యర్థాలను రోడ్డుపై వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యూజర్ చార్జీలను ప్రతి ఒక్కరూ చెల్లించాలని, చెత్త సేకరణకు ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, షేక్ బాజిహుస్సేన్, జి.ప్రసాద్, ఎం.సుబ్బారావు, పి.సుధాకర్, సిఎంఎంఓలు వి.మాధవరావు, సిహెచ్ అరుణకుమారి, సిఓలు, ఆర్‌పిలు, నగరదీపికలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సిఐటియు గుంటూరు జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు

ముగిసిన 10వ మహాసభ - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు



మహాసభలో ఎన్నికైన నూతన కార్యవర్గం

గుంటూరులో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న సిఐటియు జిల్లా 10వ మహాసభ సోమవారం ముగిసింది. జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డి.లక్ష్మీనారాయణ, వై.నేతాజి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, ఎస్.ఎస్.చెంగయ్య, వి.దుర్గారావు, ఎస్.కె.హుస్సేన్‌వలి, ఎన్.రమాసుష్మ, టివిజి రవిశంకర్, కార్యదర్శులుగా ఎన్.శివాజీ, బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, ఎం.భాగ్యరాజు, వై.సుబ్బారావు, ఎన్.రమేష్, కార్యవర్గ సభ్యులుగా 30 మందిని, కౌన్సిల్ సభ్యులుగా మరో 82 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తొలుత డి.లక్ష్మీనారాయణ, టి.రాధ, కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మహాసభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి.నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికవర్గం ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ వల్ల కార్మిక హక్కులను హరిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవటం కార్మిక వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని కోరారు. అసంఘటిత కార్మికులైన భవన నిర్మాణం, ఆటో ముఠా, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డు నుండి అక్రమంగా తరలించిన 850 కోట్లను తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేసి, క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన సవరణ చేసి అమలు చేయాలని, పరిశ్రమల్లో కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ, సామాజిక భద్రతా చట్టాలను అమలు చేయాలని కోరారు.

హక్కుల హననంలో కేంద్రం బాటలోనే రాష్ట్రం

సిఐటియు పల్నాడు జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్

ముగిసిన ప్రథమ మహాసభ - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా


అభివాదం చేస్తున్న నూతన కార్యవర్గం

వినుకొండ పట్టణంలోని గుంజరి ఏసు నగర్ (గుర్రం జాషువా కళా ప్రాంగణం)లో రెండ్రోజులపాటు నిర్వహించిన సిఐటియు పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ సోమవారం ముగిసింది. నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కె.హనుమంతరెడ్డి, ఎస్.ఆంజనేయులు నాయక్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా డి.శివకుమారి, మరో 12 మంది ఆఫీస్ బేరర్లు, సభ్యులుగా 43 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కేంద్రంలోని మోడీ కాలరాస్తుంటే అదే బాటలో రాష్ట్రంలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా నడుస్తున్నారని విమర్శించారు. భవన నిర్మాణ, కార్పెంటర్స్, పెయింటింగ్, తదితర రంగాల కార్మికుల ప్రసవం, మరణ సందర్భాల్లో ఆర్థిక సాయంతోపాటు కార్మికుల పిల్లల చదువు కోసం స్కాలర్‌షిప్‌లు కార్మిక శాఖ ద్వారా ఇచ్చేవారని, వైసిపి అధికారంలోకి వచ్చాక వీటిని ఎత్తేశారని విమర్శించారు. కార్మిక శాఖ నిధులను దారి మళ్లిస్తున్నారని మండిపడ్డారు. యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పి.రమేష్‌బాబు సౌహార్ధ సందేశమిస్తూ ప్రభుత్వాలు అనుసరించే నియంతృత్వ చర్యలను ఉమ్మడి పోరాటాలతో తిప్పికొట్టాలన్నారు. పోరాట నినాదాలు వినిపించకుంటే బానిసత్వ విత్తనాలు మొలకెత్తుతాయని హెచ్చరించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు, ట్రెజరర్ కె.హనుమంతరెడ్డి మాట్లాడుతూ గుర్రం జాషువా, పులుపుల శివయ్య వంటి మహనీయులు పుట్టిన గడ్డపై సిఐటియు పల్నాడు జిల్లా తొలి మహాసభ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మహాసభ జయప్రదానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. గత కార్యక్రమాలను సమీక్షించిన మహాసభ రానున్న మూడేళ్లలో నిర్వహించాల్సి పోరాటాపై చర్చించించి ప్రణాళికలు రూపొందించింది. పలు కార్మికుల సమస్యలపై తీర్మానాలను ఆమోదించింది. మహాసభలో ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం, విఆర్ఎ, విద్యుత్, ఎల్ఐసి, ఏజెంట్స్, భవన నిర్మాణ, మున్సిపల్ తదితర పలు రంగాల నుండి కార్మికులు పాల్గొన్నారు.



సబ్ జూనియర్ వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-తెనాలి

వాలీబాల్ సబ్ జూనియర్ జిల్లా బాల బాలికల జట్ల ఎంపిక పూర్తయ్యింది. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో జరిగిన జట్ల ఎంపిక వివరాలను అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.నిరంజనరావు సోమవారం వెల్లడించారు. బాలుర జట్టులో కె.జగదీష్‌రెడ్డి, కె.మణికంఠ, కె.జస్వంత్, కె.సందీప్, ఎస్‌కే డేవిడ్‌రాజు, ఆర్.దేవతిరెడ్డి, ఎస్.అన్వేష్, ఎం.శ్రీగణేష్, కె.మహేంద్ర, ఎం.శ్రీనివాసరెడ్డి, ఎ.పవన్, కె.కార్తీక్, స్టాండ్ బైలో ఎం.మహేష్‌రెడ్డి, ఎస్‌కె అబ్దుల్, కె.నవీన్‌కిషోర్ ఉన్నారు.

బాలికజ జట్టులో ఎం.జ్యోత్స్న. వై.చంద్రిక, డి.సవేద, ఎస్‌కె సోని, సిహెచ్ దుర్గాప్రసన్న, బి.మనీష, ఎం.సుమశ్రీ, ఎం.త్రివేణి, వై.వీర రాఘవమ్మ, ఎ.నాగహర్షిత, ఎం.జాస్మిన్, కె.ప్రీతి స్టాండ్‌బైలో బేబి సునీత, గీతికశ్రీ, ఎం.శవలీల ఉన్నారు. ఎంపికలకు 75 మంది బాలురు, 64 మంది బాలికలు హాజరైనట్లు తెలిపారు. జిల్లా తరపున ఎంపికైన ఇరుజట్లు ఈనెల 23న విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఎంపిక కమిటీ సభ్యులుగా వెంకటనారాయణ, అంకినీడు, ఫిజికల్ డైరెక్టర్లు టి.వెంకటేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, సిహెచ్ రంజిత్‌కుమార్, నాగేశ్వరరావు, బిఎల్ కాంతమ్మ వ్యవహరించారు.



ఎల్ఐసి ఉద్యోగుల సమస్యలపై కేంద్రం నిర్లక్ష్యం

ప్రజాశక్తి-తెనాలి



ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసనలో ఉద్యోగులు

ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం స్థానిక కొత్తపేటలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద ఎల్ఐసిలో పెన్షనర్స్ సమ్యలపై నిరసన వ్యక్తం చేశారు. నూనత పెన్షన్ విదానాన్ని రద్దు చేయాలని, ఫ్యామిలీ పెన్షన్‌ను 30 శాతానికి పెంచాలని, పెన్షనర్ల ఆదాయాన్ని ఇన్‌కంట్యాక్స్ పరిధి నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు వేదాంతం ఫణీంద్ర మాట్లాడుతూ ఎల్ఐసి ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరింస్తోందన్నారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పూర్ణచంద్రరావు, హరనాథ్, పోస్టల్ రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు రషీద్, తూనుగుంట్ల సురేష్, బి.పూర్ణనారాయణ, శివనాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


బందోబస్తు విధుల్లో పోలీసులు

మాచర్లలో నేటి వరకు సెక్షన్ 144

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో 144 సెక్షన్ మంగళవారం వరకూ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు. గత శుక్రవారం వైసిపి, టిడిపి శ్రేణుల మధ్య ఘర్షణల నేపథ్యంలో ఈ సెక్షన్ విధించారు. తొలి విడతగా ఈ నెల 17వ తేది నుండి 20వ తేది వరకు 144 సెక్షన్ ఉంటుందని అధికారులు ప్రకటించారు. పలు కూడళ్లలో పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. మంగళవారం తర్వాత దీన్ని పొడిగిస్తారా? ముగిసిస్తారా? అనేది చర్చనీయాంశమైంది.


బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

డివిజన్ కప్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

తెనాలి డివిజన్ కప్ క్రికెట్ టోర్నీని స్థానిక కొత్తపేట తాలూకా జూనియర్ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సోమవారం ప్రారంభించారు. చదువుతోపాటు యువత క్రీడల్లోనూ రాణించాలన్నారు. తద్వారా మంచి గుర్తింపు, మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులతో పాటు హరిదాసు గౌరీ శంకర్, వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, బూరెల దుర్గా, కఠారి హరీష్, సుభాని, క్రీడాకారులు పాల్గొన్నారు.